క్లుప్తంగా

సెల్‌ఫోన్ అప్పగింత



తమకు దొరికిన ఫోన్ ఎస్సైకు అప్పగిస్తున్న ప్రజాప్రతినిధులు

పాలకొండ రూరల్: పాలకొండ–వీరఘట్టం రహదారిలో తమకు దొరికిన విలువైన సెల్‌ఫోన్‌ను పోలీసులకు అప్పగించి బుక్కూరు, టీకే.రాజపురం ప్రజా ప్రతినిధులు వి.కొండలరావు, వి.జనార్ధనరావు తమ నిజాయితీని చాటుకున్నారు. శనివారం వారు ద్విచక్ర వాహనంపై పాలకొండ వస్తుండగా భాసూరు సమీపంలో ఖరీదైన స్మార్ట్‌ఫోన్ దొరికింది. దాన్ని నేరుగా పాలకొండ పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్లి ఎస్సై ప్రశాంత్‌కుమార్‌కు అప్పగించారు. ఫోన్‌లో ఉన్న వివరాలను పరిశీలించిన పోలీసులు అది తుమరాడ గ్రామానికి చెందిన యువకునిదిగా గుర్తించారు. ఎస్సై ప్రశాంత్‌కుమార్ బాధితుడికి ఫోన్ అందించారు.

భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు

గరుగుబిల్లి: తోటపల్లిలోని శ్రీవేంకటేశ్వరస్వామి, పద్మావతి అమ్మవార్లను పెద్దసంఖ్యలో భక్తులు శనివారం దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం సుప్రభాతసేవ, మంగళాశాసనం, తదితర పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు స్వామి వారి దర్శనం కల్పించారు. పుట్టుదేవుని వద్ద కూడా భక్తులు విశేష పూజలు చేశారు. పలువురు తలనీలాలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు.

సామరస్యంగా మెలగాలి



భాసూరు గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై

పాలకొండ రూరల్: ఎన్నికల పోలింగ్ ప్రక్రియకు సహకరించిన ప్రజలు ఫలితాలు వచ్చేవరకూ సామరస్యంగా మెలగాలని ఎస్సై కె.ప్రశాంత్‌కుమార్ కోరారు. గ్రామాల్లో రాజకీయ ప్రస్తావనలతో కవ్వింపులకు పాల్పడిన, విద్వేషాలు రెచ్చగొట్టే చర్యలను ప్రత్యక్షంగా లేక పరోక్షంగా ప్రోత్సహించిన కఠినమైన కేసులు నమోదు చేయనున్నట్లు చెప్పారు. ఫలితాలు వచ్చే వరకూ పోలీస్ 30 యాక్ట్, 144 సెక్షన్ అమలవుతుందన్నారు. క్షేత్రస్థాయిలో పోలీస్ సిబ్బంది అంతర్గత పర్యవేక్షణ ద్వారా పల్లెల్లో రోజువారీ నివేదికలు సేకరిస్తున్నామన్నారు. మండలంలోని వీపీ.రాజుపేట, భాసూరు, కోటిపల్లి, ఎల్.ఎల్.పురం గ్రామాల్లో శనివారం పర్యటించారు. అక్కడి ప్రజలకు, యువతకు చట్టాలపై అవగాహన కల్పించారు.

103 మంది విద్యార్థులు హాజరు



పరీక్ష కేంద్రం నుంచి బయటకు వస్తున్న విద్యార్థులు

భామిని: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. శనివారం జరిగిన ఇంగ్లిష్ పరీక్షకు 103 మంది విద్యార్థులు హాజరైనట్లు ప్రిన్సిపాల్ ఎర్రంనాయుడు తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పరీక్ష కేంద్రంలో ఏర్పాట్లు చేశారు.

చిత్రలేఖనంపై తర్ఫీదు



బొమ్మలు వేస్తున్న విద్యార్థులు

భామిని: స్థానిక శాఖాగ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా శనివారం విద్యార్థులకు చిత్రలేఖనంపై శిక్షణ ఇచ్చారు. నంబర్లు, రేఖలతో చిత్రాలు ఏలా గీయాలో వివరించారు. అనంతరం విద్యార్థులతో బొమ్మలు వేయించారు.

ఘనంగా పెద్దమ్మతల్లి సంబరాలు



పెద్దమ్మతల్లి గుడివద్ద భక్తుల పూజలు

భామిని: మండలంలోని దిమ్మిడిజోలలో గ్రామ దేవత పెద్దమ్మతల్లి సంబరాలు శనివారం ప్రారంభమయ్యాయి. మహిళలు ఘటాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మందిరం నుంచి అమ్మవారి పాదాలను తెచ్చి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఘటాల మండపం వద్ద ప్రతిష్టించారు. గ్రామస్తులంతా పూజా కార్యక్రమాల్లో పాల్గొని పూజలు చేశారు. గ్రామంలోని అన్ని వీధుల్లో విద్యుత్ దీపాల వెలుగులు మిరిమిట్లుగొలిపాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బంధువులు, స్నేహితులతో ఊర్లో పండగ వాతావరణం నెలకొంది.

రైతు సేవలో.. పీఏసీఎస్

- వివిధ రకాల రుణాల మంజూరు
- ధాన్యం కొనుగోలుతో పాటు ఇతర సేవలు

వీరఘట్టం: రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ఆశయాలను నెరవేర్చేందుకు వీరఘట్టం సహకార సంఘం అడుగులేస్తోంది. కేవలం పంట రుణాలకే పరిమితం కాకుండా రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయడం, వారికి అవసరమైన ఆర్థిక సహకారం అందించడం, ఇంకా మరెన్నో కార్యక్రమాలు కొనసాగిస్తూ రైతు సేవలో ముందు వరుసలో నిలుస్తోంది. అసైన్డ్ పట్టాదారులకు రుణాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటోంది. గత రెండు సీజన్లల్లో రూ.7.63 కోట్లు మేర ధాన్యం వ్యాపారం చేసింది. 495 మంది రైతుల నుంచి 50 వేల క్వింటాళ్ల ధాన్యం సేకరించింది. రైతులకు వారి ఖాతాల్లో నగదు జమ చేయడంలో చురుగ్గా వ్యవహరించింది. పట్టాదారు పుస్తకాలు కలిగిన రైతులకు ఎకరానికి దీర్ఘకాలిక రుణాలు కింద అతి తక్కువ వడ్డీకి రూ.లక్ష నుంచి రూ.3 లక్షలు మేర రుణాలు అందిస్తోంది. గత ఏడాది 216 మంది రైతులకు రూ.18 కోట్లు వరకు రుణాలు అందజేసింది.



వీరఘట్టం పీఏసీఎస్ కార్యాలయం

వీరఘట్టం పీఏసీఎస్‌లో లావాదేవీల వివరాలు

	రైతుల సంఖ్య	రుణం మొత్తం
మూల షేర్	4,637	రూ.18.64 కోట్లు
స్వల్పకాలిక రుణాలు	2,785	రూ.18.01 కోట్లు
దీర్ఘకాలిక రుణాలు	85	రూ.99.82 లక్షలు
ఇతర రుణాలు	26	రూ.77.22 లక్షలు
ధాన్యం వ్యాపారం	495	రూ.7.63 కోట్లు

రూ.18 కోట్ల రుణాలిచ్చాం

వీరఘట్టం సహకార సంఘం ద్వారా రైతులకు గత ఏడాది ఖరీఫ్‌లో సుమారు రూ.18 కోట్ల రుణాలు అందించాం. అలాగే రైతులకు ప్రభుత్వ మద్దతు ధర చెల్లించి ధాన్యం కొనుగోలు చేపట్టాం. గతేడాది రూ.7.63 కోట్ల వ్యాపారం చేశాం. రైతులకు అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తున్నాం.

– కర్రి గోవిందరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు, వీరఘట్టం

పశువులకు జబ్బవాపు నివారణ టీకాలు



పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి లక్ష్మణరావు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని గొరడ గ్రామంలో పశువులకు జబ్బవాపు వ్యాధి నివారణ టీకాలు శనివారం వేశారు. ఈ సందర్భంగా గొరడ పశువైద్యాధికారి పి.లక్ష్మణరావు మాట్లాడుతూ కలుషితమైన మేత, నీరు తీసుకోవడం ద్వారా 6 నెలల నుంచి 3 ఏళ్ల వయసు పైబడిన ఆవులు, గేదెలకు జబ్బవాపు వ్యాధి సోకే అవకాశం ఉందన్నారు. తీవ్రమైన జ్వరం, శ్వాస ఎక్కువగా తీసుకోవడం, భుజాలు, తొడల వాపు వంటివి వ్యాధి లక్షణాలని, వాటిని గుర్తిస్తే వెంటనే పశువైద్య కేంద్రాన్ని సంప్రదించాలని తెలిపారు. ప్రస్తుతం జబ్బవాపు వ్యాధి పశువులకు సోకకుండా గ్రామగ్రామానికి వెళ్లి, ముందస్తుగా టీకాలు వేస్తున్నామన్నారు. ఎవరైనా తమ పశువులకు టీకాలు వేయకపోతే వెంటనే రైతు భరోసా కేంద్రాల పరిధిలో పనిచేస్తున్న పశుసంవర్ధక సహాయకులను సంప్రదించి, పశువులకు టీకాలు వేయించాలని తెలిపారు.

నిలకడగా జీడిపిక్కల ధర



రైతుల నుంచి వ్యాపారులు కొనుగోలు చేసిన జీడిపిక్కలు

కురుపాం: స్థానిక మార్కెట్‌లో జీడిపిక్కల ధర నిలకడగా కొనసాగుతోంది. ఈ ఏడాది పంట దిగుబడి తక్కువగా ఉండడంతో డిమాండ్ బాగా పెరుగుతుందని ఆశగా ఎదురుచూసిన జీడి రైతుకు నిరాశే ఎదురైంది. సీజన్ మొదటి నుంచి ఇప్పటివరకు కిలో జీడిపిక్కల ధర రూ.100 నుంచి రూ.110 మాత్రమే ఉండడంతో తప్పనిసరి పరిస్థితుల్లో కొంతమంది రైతులు అదే ధరకు విక్రయించారు. గతేడాది కిలో జీడిపిక్కల ధర రూ.150 వరకు ఉందని, ఈ ఏడాది మరీ ఇంత తక్కువ ఉంటుందని ఊహించలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా మరికొంతమంది ఈ నెలాఖరులోనైనా ధరలు పెరగకపోతాయా అని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో చాలామంది జీడి రైతులు తమ వద్దనే జీడిపిక్కల నిల్వలు ఉంచుకుని, మంచి ధర వచ్చేటప్పుడు విక్రయిస్తామని చెబుతుండడం గమనార్హం.

పుస్తక పఠనంతో మేధో వికాసం



పాలకొండ రూరల్: మాట్లాడుతున్న హెచ్‌ఎం బాలమురళి

పాలకొండ రూరల్: నిరంతర పుస్తక పఠనంతో విద్యార్థుల్లో దాగిఉన్నత అంతర్గత ఆలోచనలకు పదును పెట్టవచ్చని ఎం.వెంకటాపురం ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం కె.బాలమురళి అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో కొనసాగుతున్న వేసవి శిబిరంలో శనివారం పుస్తక పఠనంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పిల్లల ఆసక్తిని గుర్తించి ప్రోత్సహించాలన్నారు. డ్రాయింగ్ ఉపాధ్యాయుడు జి.మురళి సంఖ్యలతో బొమ్మలు వేసే విధానంపై తర్ఫీదు ఇచ్చారు. కార్యక్రమంలో గ్రంథపాలకుడు బి.గణేష్‌బాబు, సహాయకులు ఈశ్వరావు తదితరులున్నారు.



గుమ్మలక్ష్మీపురం: పుస్తక పఠనం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరిస్తున్న లైబ్రేరియన్ సుకన్య

పుస్తక పఠనంతో అపారజ్ఞానం

గుమ్మలక్ష్మీపురం: పుస్తక పఠనం ద్వారా అపారమైన జ్ఞానం వస్తుందని లైబ్రేరియన్ డి.సుకన్య తెలిపారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు పుస్తక పఠన పోటీలతో పాటు కథల పోటీలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రాథమిక దశ నుంచే విద్యార్థులు పుస్తకాలు చదవడాన్ని అలవాటుగా చేసుకోవాలని సూచించారు. పుస్తకాల్లోనే ప్రపంచ జ్ఞానం ఉందని, వాటితోనే మనకు అన్ని విషయాలు తెలుస్తాయన్నారు. ప్రతీ విద్యార్థి పుస్తకాలు చదివేందుకు ఆసక్తి కనబరచాలన్నారు.

ఇంటి నుంచే ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్

సీతంపేట: నిరుద్యోగ యువత ఇకపై ఇంటి వద్ద నుంచే ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్ చేసుకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పించింది. ఉపాధి కల్పన కార్యాలయాల ద్వారా అందించే సేవలన్నింటినీ భారత ప్రభుత్వ నేషనల్ కెరీర్ పోర్టల్ సర్వీస్ ద్వారా ఇంటి వద్ద నుంచే పొందవచ్చని గిరిజన సంక్షేమ శాఖ డీడీ అన్నదొర శనివారం తెలిపారు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎంప్లాయిమెంట్.ఏపీ.జీఓవీ.ఇన్ పోర్టల్‌లో పదోతరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణులైన విద్యార్థులు తమ వివరాలను నమోదు చేసు కోవచ్చన్నారు. అభ్యర్థి కలర్‌ఫోటో, సంతకం, కుల ధ్రువీకరణ పత్రం, పదో తరగతి సర్టిఫికెట్, ఇంటర్, డిగ్రీ ప్రొవిజినల్, మార్కుల మెమో, దివ్యాంగులైతే సదరం సర్టిఫికెట్‌ను పొందుపరచాల్సి ఉంటుందన్నారు.

సబ్ జైల్‌ను సందర్శించిన న్యాయమూర్తి



రిమాండ్ ఖైదీలతో మాట్లాడుతున్న న్యాయమూర్తి విజయ్‌రాజ్‌కుమార్

పాలకొండ రూరల్: రిమాండ్ ఖైదీల ఆరోగ్య సంరక్షణ విషయంలో జైలు సిబ్బంది బాధ్యతగా వ్యవహరించాలని పాలకొండ జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి ఎ.విజయ్‌రాజ్‌కుమార్ అన్నారు. స్థానిక సబ్ జైల్‌ను బార్ అసోసియేషన్ సభ్యులతో కలిసి శనివారం ఆకస్మికంగా సందర్శించారు. జైలు రికార్డులను పరిశీలించారు. అనంతరం రిమాండ్ ఖైదీలతో మాట్లాడుతూ.. బెయిల్ కోసం న్యాయవాదులను సంప్రదించారా అని ప్రశ్నించారు. సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. జైలులో వారికి అందుబాటులో ఉన్న సౌకర్యాలపై ఆరా తీశారు. వేసవి నేపథ్యంలో ఇబ్బందులు లేకుండా చూడాలని, మెనూ ప్రకారం ఆహారం అందించాలని జైలు సిబ్బందికి సూచించారు. ఆయన వెంట సబ్‌జైలు హెడ్‌వార్డర్ బి.విజయకుమార్, బార్ సభ్యులు పి.మునిస్వామి, ఎం.వెంకటేశ్వరరావు, వార్డర్లు పి.మధు, నరసింహులు ఉన్నారు.

విజయోత్సవ ర్యాలీలు చేయొద్దు



గ్రామస్తులకు సూచనలిస్తున్న సీఐ సత్యనారాయణ

కురుపాం: సార్వత్రిక ఎన్నికల ఫలితాల తర్వాత ఏ పార్టీ వారైనా విజయోత్సవ ర్యాలీలు నిర్వహించడానికి వీలులేదని, ఒకవేళ ఎవరైనా ర్యాలీలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎల్విన్‌పేట సీఐ సత్యనారాయణ, కురుపాం ఎస్‌ఐ షణ్ముఖరావు సూచించారు. శనివారం స్థానిక పంచాయతీ పరిధిలోని శివ్వన్నపేటలో ఎన్నికల నిబంధనలపై సదరు అధికారులు కలిసి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. జూన్ 4వ తేదీన ఎన్నికల ఫలితాలు విడుదలవుతాయని, నిబంధనలకు అనుగుణంగా మాత్రమే గెలిచిన అభ్యర్థులు తమ ఆనందాన్ని పంచుకునే కార్యక్రమాలు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల ఫలితాల నేపథ్యంలో రాజకీయ పార్టీల వారు ఒకరికొకరు దూషించుకోకూడదని, దుర్భాషలాడుకోవద్దని, తగాదాలు ఆడుకోవద్దని తెలిపారు. గ్రామాల్లో ప్రశాంత వాతావరణం ఉండేలా చూడాల్సిన బాధ్యత గ్రామపెద్దలపై ఉందన్నారు.

చెరువు మట్టితో నేల సారవంతం



పంటపొలంలో నేల సారవంతానికి వేసిన చెరువు మట్టి

గరుగుబిల్లి: పంటపొలాల్లో చెరువు మట్టి వేసుకుని కలియదున్నితే నేలసారవంతమై, అధికంగా పంట దిగుబడులు వస్తాయని వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు సూచిస్తున్నారు. ప్రస్తుతం పంట భూముల్లో సేంద్రియ పదార్థం తక్కువగా ఉండడం, వర్షపునీటిని నిలుపుకునే సామర్థ్యం తగ్గుతుండడంతో దిగుబడులు ఆశించినంతగా ఉండడం లేదు. ప్రస్తుతం మారిన వాతావరణ పరిస్థితుల కారణంగా రసాయన ఎరువులను విపరీతంగా వినియోగిస్తుండడంతో భూములు నిస్సారమైపోతున్నాయి. ఈ నేపథ్యంలో చెరువు మట్టిని పొలాల్లో ఎరువుగా వేసుకుంటే సత్ఫలితాలు ఉంటాయని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం వేసవి కావడంతో చెరువుల్లో నీరు అడుగంటిపోతుందని, చెరువులోని మట్టిని సేకరించడానికి ఇదే సరైన సమయం. రసాయన ఎరువుల్లో ఉండే పోషకాలే చెరువు మట్టిలో కూడా లభిస్తాయి. వర్షాలు బాగా కురిసినప్పుడు ఎత్తైన ప్రదేశాల నుంచి వర్షపు నీటితో పాటు ఇసుక, బంకమట్టి, ఒండ్రుమట్టి, కుళ్లిన వ్యర్థాలతో కలిసి చెరువులోకి చేరుతాయి. అందులో నీరు ఉన్నంతకాలం లోపలే కుళ్లి మంచి సేంద్రియ కర్బనంగా మారుతుంది. ఈ క్రమంలో చెరువు మట్టిలో 70 శాతం ఒండ్రు, 30 శాతం బంకమట్టి ఉంటుంది. పంటలకు అవసరమయ్యే నత్రజని, భాస్వరం, పొటాష్‌లతో పాటు సూక్ష్మపోషకాలు కూడా ఈ మట్టిలో ఉంటాయి. ఈ మట్టి వేసుకోవడం ద్వారా నేలలో నీటి నిల్వ సామర్థ్యం పెరిగి, పంటకు ఉపయోగపడుతుంది. గరుగుబిల్లి, పెద్దూరు, ఉల్లిభద్ర, చినగుడబ తదితర గ్రామాల్లోని రైతులు నేల ద్వారా పంటకు అవసరమయ్యే పోషకాలు అందించేందుకు చెరువు మట్టిని వినియోగిస్తుండడం విశేషం.

ప్రజారోగ్యంపై దృష్టి సారించండి



సిబ్బందికి సూచనలిస్తున్న జిల్లా మలేరియా నివారణ అధికారి జగన్‌మోహనరావు

కొమరాడ: ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టిసారించాలని, గ్రామీణ ప్రాంతాల్లో జ్వరాలు ప్రబలకుండా సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని జిల్లా మలేరియా నివారణ అధికారి డాక్టర్ టి.జగన్‌మోహనరావు ఆదేశించారు. మండలంలోని అంటివలస గ్రామంలో ఎక్కువ మంది జ్వరాల బారినపడి బాధపడుతున్న విషయం తెలుసుకున్న ఆయన శనివారం ఆ గ్రామాన్ని సందర్శించి, జ్వరపీడితులపై ఆరాతీశారు. అనంతరం అక్కడ నిర్వహించిన వైద్య శిబిరానికి వెళ్లి, అక్కడి వైద్య సిబ్బంది చేపట్టిన ఫీవర్ సర్వేలో ఇద్దరికి జ్వరం సోకినట్లు తెలుసుకున్నారు. రోగులకు మెరుగైన వైద్యం అందించాలని సిబ్బందికి సూచించారు. ఆ తర్వాత గ్రామంలోని పారిశుద్ధ్య పరిస్థితులను తనిఖీ చేసి, మురుగు, నీటి నిల్వలు ఉండకుండా చూడాలని గ్రామస్తులను కోరారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత కూడా పాటించాలని తెలిపారు. దోమల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో మల్లికార్జునరావు, వైద్యాధికారి శామ్యూల్, ఏఎంవో సూర్యనారాయణ, ఈవోపీఆర్‌డీ రాధాకృష్ణ, సీహెచ్‌వో బంగారుబాబు తదితరులు పాల్గొన్నారు.

వేతనదారులందరికీ పనులు

సీతానగరం: వలసలను నివారించాలనే ఉద్దేశంతో జాబ్‌కార్డులు ఉన్నవారందరికీ ఉపాధి పనులు కల్పిస్తున్నట్లు ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీఓ భాను అన్నారు. మండలంలోని తామరఖండి, బల్ల కృష్ణాపురం గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అర్హులందరికీ జాబ్‌కార్డులు అందజేసినట్లు చెప్పారు. చెరువుల అభివృద్ధి, గోర్జిలు, తోటల అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. చిన్న, సన్నకారు రైతులకు చెందిన కమతాల్లో తోటల పెంపకం, ఆయా తోటల్లోనే ఉపాధి పనులు కల్పించడం జరుగుతుందన్నారు. అనంతరం ఆన్‌లైన్ మస్తర్లను పరిశీలించారు. తామరఖండిలో శనివారం 536 మంది వేతనదారులు పనులకు హాజరైనట్లు గుర్తించారు. కార్యక్రమంలో టెక్నికల్ సహాయకులు, ఆయా గ్రామాల క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

సకాలంలో లక్ష్యాలు పూర్తిచేయాలి

- డీఈఓ పగడాలమ్మ



డీఈఓకు పుస్తక నిల్వల వివరాలు తెలియజేస్తున్న డిప్యూటీ ఈఓ కృష్ణమూర్తి

పాలకొండ రూరల్: నాడు–నేడు పనులు సకాలంలో పూర్తి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి పగడాలమ్మ ఆదేశించారు. శనివారం పాలకొండ వచ్చిన డీఈఓ పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణను పరిశీలించారు. అనంతరం డిప్యూటీ ఈఓ పి.కృష్ణమూర్తితో కలిసి జీహెచ్‌ఎస్‌కు చేరిన పుస్తక నిల్వలను పరిశీలించారు. ఈ క్రమంలో స్థానిక వీవర్స్ కాలనీ ప్రభుత్వ పాఠశాల, పెద్దకాపువీధి జెడ్పీ ఉన్నత పాఠశాలతో పాటు మండలంలోని పలు పాఠశాలల్లో జరుగుతున్న నాడు–నేడు పనుల తాజా స్థితిగతులను పరిశీలించారు. పనులు వేగవంతం చేసేందుకు వీవర్స్ కాలనీ పాఠశాలకు రూ.లక్ష, పెద్దకాపువీధి జెడ్పీఉన్నత పాఠశాలకు రూ.4 లక్షలు కేటాయిస్తామన్నారు. 15 రోజుల్లో పనులు పూర్తి చేయాలన్నారు. బడులు తెరిచే సమయానికి పూర్తి హంగులతో బోధనకు సిద్ధం కావాలన్నారు. ఆమె వెంట ఎంఈఓ కురిటి సోంబాబు, పలువురు హెచ్‌ఎంలు ఉన్నారు.

ఉదయం ఎండ.. సాయంత్రం వర్షం



పార్వతీపురం పట్టణంలో కురుస్తున్న వర్షం

పార్వతీపురం టౌన్: మూడు రోజులుగా పార్వతీపురంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎండల తీవ్రత ఎక్కువగా ఉంటోంది. నియోజకవర్గ వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరిగాయి. వడగాలుల తీవ్రత అధికమైంది. ఎండల వేడిమి, ఉక్కపోతతో అల్లాడిన ప్రజలు సాయంత్రం వేళ ఉపశమనం పొందుతున్నారు. ఆరు గంటల ప్రాంతం నుంచి పార్వతీపురం సహా వివిధ మండలాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షం కురుస్తోంది. దీంతో వాతావరణం చల్లబడింది. సాయంత్రం నుంచి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి.

శిశువు భద్రం..



శిశు మరణాలు తగ్గించడానికి ఏర్పాటుచేసిన ఎస్‌ఎన్‌సీ యూనిట్

- ప్రభుత్వాస్పత్రుల్లో ప్రత్యేక వైద్యసేవలు
- మూడేళ్లుగా తగ్గిన శిశు మరణాల రేటు

పార్వతీపురం టౌన్: శిశు మరణాలు తగ్గించాలనే ఉద్దేశంతో జిల్లాలోని ప్రభుత్వ వైద్యశాలలతో పాటు ఏరియా ఆస్పత్రులు, సీహెచ్‌సీలలో మాతా, శిశు కేంద్రాలు ఏర్పాటు చేసి తల్లీబిడ్డలకు మెరుగైన వైద్యసేవలందిస్తున్నారు. అలాగే ప్రతి సీహెచ్‌సీలో న్యూబోర్న్ స్టెబిలైజేషన్ యూనిట్లను ఏర్పాటు చేశారు. ఇందులో వార్మర్లు, ఫొటోథెరపీ యూనిట్స్, ఆక్సిజన్ సప్లై, చైల్డ్ రెసిస్టేషన్ పరికరాలుంటాయి. ఈ యూనిట్లలో సేవలు అందించేందుకు చిన్న పిల్లల వైద్యులు, నర్సింగ్ సిబ్బందిని నియమించారు. అప్పుడే పుట్టిన బిడ్డలకు ఇబ్బంది ఉంటే వైద్యసేవలు అందించి, మెరుగైన వైద్యం అవసరమనుకుంటే పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి రిఫర్ చేస్తున్నారు. శిశు మరణాలను పూర్తిగా తగ్గించాలన్నదే ప్రభుత్వ ధ్యేయం.



ఎస్‌ఎన్‌సీయూ యూనిట్‌లో చికిత్స పొందుతున్న చిన్నారులు

ప్రాణం పోస్తున్న జిల్లా ఆస్పత్రి..

పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో గల ప్రభుత్వ వైద్యశాలలో చిన్న పిల్లల విభాగంలో ఎస్‌ఎన్‌సీయూ యూనిట్ ఏర్పాటు చేశారు. ఈ విభాగంలో ప్రతిరోజూ 20 నుంచి 30 మందికి పైగా పసిపిల్లలు చికిత్స పొందుతూ ఉంటారు. దీంతో పాటు ఇక్కడ ఎస్‌ఎన్‌సీయూలో ప్రత్యేక పది పడకల వార్డు ఉంది. ఇక్కడ నెలలు నిండని పిల్లలు, తక్కువ బరువున్న పిల్లలకు ఎన్‌ఆర్‌సీ(న్యూట్రీషన్ హెబిటేషన్ సెంటర్) ద్వారా శ్వాస సంబంధిత, పుట్టుకతో వచ్చే లోపాలకు చికిత్స అందజేస్తున్నారు. పసిపిల్లల్లో అధికంగా శ్వాస సంబంధిత ఇన్‌ఫెక్షన్లు ఎక్కువగా ఉండడంతో వారిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.

మరణాల రేటు తగ్గించడమే ధ్యేయం



శిశు మరణాల సంఖ్యను తగ్గించేందుకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది. అందుకు అనుగుణంగా ఆస్పత్రులలో చిన్నారుల కోసం అధునాతన వైద్య పరికరాలు మంజూరు చేసింది. చిన్న పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తిని పెంపొందించేందుకు, వారిని ప్రాణాపాయం నుంచి రక్షించేందుకు ఎస్‌ఎన్‌సీయూ యూనిట్లు ఉపయోగపడతాయి.

– డాక్టర్. బి వాగ్దేవి, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్.

ఆస్పత్రిలోనే పౌష్టికాహారం, మందులు

పేద గర్భిణుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తోంది. మహిళలు గర్భం దాల్చినప్పటి నుంచి ప్రసవం అయ్యేవరకు ఎలాంటి ఖర్చు లేకుండా ఆరోగ్య కేంద్రాల్లో వైద్యుల చేత పరీక్షలు నిర్వహించి మందులు ఇస్తున్నారు. రక్తం తక్కువైన వారికి మాత్రలతో పాటు సుక్రోజ్ ఇంజెక్షన్లు, అవసరమైన వారికి రక్తాన్ని కూడా ఎక్కిస్తున్నారు. అలాగే పుట్టినప్పటి నుంచి శిశువులకు రెండేళ్ల వయస్సు వచ్చే వరకు అవసరమైన టీకాలు వేస్తున్నారు.